అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్
- బతుకమ్మ చీరెలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

తాంసి, అక్టోబర్ 4 : అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ పేర్కొన్నారు. బుధవారం తాంసిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్‌కిట్లు అందజేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నారత్న ప్రకాశ్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఎంపీపీ మంజులాశ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు సదానందం, సర్పంచ్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్

తలమడుగులో..

తలమడుగు, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. అనంతరం 28 గ్రామ పంచాయతీల యువజన సంఘాలకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మి, ఎంపీడీవో రమాకాంత్, ఏపీఎం స్వామి, నాయకులు పాల్గొన్నారు.

పోచంపహాడ్‌కు తరలిన రైతులు

పోచంపహాడ్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ భూమి పూజలో బోథ్ రైతులు

బోథ్, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లా పోచంపహాడ్ వద్ద బుధవారం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ భూమి పూజ కార్యక్రమానికి బోథ్ రైతులు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో బొడ్డు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, రాజారాం, సాయరెడ్డి, భగవాన్‌రెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఇచ్చోడ, అక్టోబర్ 4: సర్వీస్‌లో అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఇచ్చోడ పోస్టాఫీస్‌లో పని చేసే జీడీఎస్ ఉద్యోగులు గురువారం ఒక రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అధీనంలో నిర్వహిస్తున్న పోస్టాఫీస్‌లో పని చేసే వారికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పెంచాలన్నారు. జీడీఎస్ కుటుంబీకులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. టార్గెట్ నెల రూపం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆపివేయాలన్నారు. కార్యక్రమంలో డీజీఎస్ ఉద్యోగులు పోశన్న, రూప, పవన్, సాయిప్రసాద్, సంజీవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

దీక్షలో కూర్చున్న యువకులు

బోథ్, అక్టోబర్ 4 : బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 81వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో యువకులు కూర్చున్నారు. వీరికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాబెరతం డా ఏవన్ యూత్ సభ్యులు, సర్పంచ్ బాబుసింగ్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

గంగపుత్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ స్వప్నారత్న ప్రకాశ్

తాంసి, అక్టోబర్ 4: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని సర్పంచ్ స్వప్నారత్నప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో చేపడుతున్న గంగపుత్ర సంఘం భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజులాశ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కాంతారెడ్డి, వార్డు సభ్యులు జింక సతీశ్, కల్యాణ్, ముత్తన్న, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జింక చిట్టి, బీఆర్ఎస్ నాయకులు అరుణ్, పరమేశ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నేరడిగొండ: వడూర్ అటవీ ప్రాంతంలో అధికారులు, సిబ్బంది

నేరడిగొండ, అక్టోబర్ 4 : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. బుధవారం మండలంలోని వడూర్, కిష్టాపూర్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖాధికారులు ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు ప్రకృతి ప్రసాదించిన దేవతలని, వాటి మనుగడ కోసం అడవులను రక్షించాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముందుగా అటవీ శాఖాధికారులు బైక్ ర్యాలీగా మండల కేంద్రంలోని సర్వీస్‌రోడ్డు గుండా అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ 7 కి.మీ. ట్రెక్కి నిర్వహించారు. కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ ఎఫ్ఆర్వోలు గణేశ్, ప్రణయ్, పుండలిక్, ఆయా రేంజ్ ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, తదితరులు పాల్గొన్నారు.

రామన్నకు ఘన సన్మానం

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను సన్మానిస్తున్న జాదవ్ అనిల్

నేరడిగొండ, అక్టోబర్ 4 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ బుధవారం శాలువాతో సన్మానించారు. బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటి సారిగా ఇంటికి వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా సన్మానించారు. డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజరెడ్డి, బోథ్, భీంపూర్ జడ్పీటీసీలు సంధ్యారాణి, సుధాకర్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, బీఆర్ఎస్ బోథ్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కృష్ణ రత్నప్రకాశ్, బోథ్ సర్పంచ్ సురేందర్‌యాదవ్, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

భీంపూర్, అక్టోబర్ 4 : గ్రామాల్లో ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బంది ప్రజల ఆరోగ్యం గురించి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని భీంపూర్ పీహెచ్‌సీ హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం ధనోరా వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, పిల్లల పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఆశ కార్యకర్తలు పద్మ, స్వప్న, సురేఖ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బోథ్, అక్టోబర్ 4: మండలంలోని సోనాల గ్రామానికి చెందిన వోడ్నాల సాయి(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ రాము తెలిపారు. మంగళవారం రాత్రి గుర్రాలతండాకు వెళ్లే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్ర గాయాలైన సాయిని మొదట బోథ్ దవాఖానకు అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ జంతువుల దినోత్సవం

నార్నూర్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జంతువుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహేందర్ పర్యావరణ పరిరక్షణలో జీవరాసుల ప్రాముఖ్యత, జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జీవశాస్త్రం అధ్యాపకులు శివప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, అధ్యాపకులు వెంకటరమణ, నరేశ్, సుజాత, జలంధర్, వైష్ణవి, గజానన్, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక

బోథ్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని నాగభూషణం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ద్యాగల గంగయ్య, నిహారికల కుమారుడు ద్యాగల రిత్విక్ అనే విద్యార్థి కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. బుధవారం విడుదల చేసిన రెండో విడుత ఫలితాల్లో చోటు దక్కించుకున్నాడు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం గత ఫిబ్రవరిలో పరీక్ష నిర్వహించారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), అక్టోబర్ 4: ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నర్సాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ సర్పరాజ్ అన్నారు. బుధవారం సిరికొండలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌టీ భానుతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి ఏడో జోనల్ గేమ్స్

ఇచ్చోడ, అక్టోబర్ 4 : మండల కేంద్రంలో గిరిజన గురుకుల కళాశాల, బాలికల పాఠశాలలో ఈ నెల 13, 14,15వ తేదీల్లో 7వ జోనల్ గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీ లక్ష్మీకాంతారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులం సొసైటీ స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, ఈఎంఆర్ఎస్ స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్, ఆర్‌సీవో గంగాధర్ కలిసి ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. ఈ జోనల్ గేమ్స్‌లో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు.

నేడు స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ

భీంపూర్, అక్టోబర్ 4 : మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల బాధ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.